సాక్షి విశాఖపట్నం

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



ఆటాడుకుందాం రా..!

పోర్ట్ స్టేడియంలో మే 1వ తేదీ నుంచి సమ్మర్ మెగా క్యాంప్ ప్రారంభం కానుంది. పలు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. 8లో



నేత్రపర్వం.. సౌజన్య అభినయం

మీనాక్షి కల్యాణం నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సౌజన్య ప్రతిభ చాటుకున్నారు. 8లో



ఆరోగ్యశ్రీ సేవలు భేష్

ఆరోగ్య శ్రీ పథకం చాలా చక్కగా నడుస్తోందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. 10లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



మేఘాద్రి గెడ్డ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా సమన్వయకర్త రూపవతి

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని 11 డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో 2023–24 సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. విశాఖ జిల్లాలో 5వ తరగతి ప్రవేశానికి 749 దరఖాస్తులు రాగా 553 మంది (75 శాతం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి 452 దరఖాస్తులు రాగా 334 మంది (75 శాతం), అనకాపల్లి జిల్లాలో 5వ తరగతి ప్రవేశానికి 2,746 దరఖాస్తులు రాగా 2,297 మంది (83 శాతం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి 1,517 దరఖాస్తులు రాగా 1,166 మంది (85 శాతం) విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు జిల్లా సమన్వకర్త ఎస్.రూపవతి తెలిపారు. నక్కపల్లి, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, సబ్బవరం, మేఘాద్రిగెడ్డ, శ్రీకృష్ణాపురం, మధురవాడ పరీక్షా కేంద్రాలను సందర్శించినట్టు చెప్పారు.

5 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట : విశాఖలో ఆదివారం ఐదు కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 107 మందికి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 40కి చేరింది. ఒకరు డిశ్చార్జ్‌కాగా 40 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు వివరించారు.

27 నుంచి బిజినెస్ ఎక్స్‌పో

అక్కిరెడ్డిపాలెం : ఈ నెల 27, 28, 29వ తేదీల్లో ఆటోనగర్ డి – బ్లాక్ మెయిన్ రోడ్డులోని సరిపల్లి గ్రాండ్‌లో నిర్వహించనున్న ఇండస్ట్రియల్ కమ్ బిజినెస్ ఎక్స్ పో – 2023 పారిశ్రామికవేత్తలకు, వ్యాపారవేత్తలకు మంచి అవకాశమని ఫ్లవరిష్ క్రియేషన్ యజమాని డి.వినోద్ ఆదివారం తెలిపారు. పారిశ్రామిక, వ్యాపార, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన ద్వారా తమ పరిచయాలకు మంచి వేదికగా ఎక్స్ పో దోహదపడుతుందని తెలిపారు. స్టాళ్ల నిర్వహణ, ఇతర వివరాలకు ఔత్సాహికులు 98855 17653, 81215 46144 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు డయల్ యువర్ మేయర్, స్పందన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. 1800 4250 0009 ద్వారా తమ ఫిర్యాదులు తెలపవచ్చు. అలాగే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ముగిసిన ఆస్కార్ ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆస్కార్ అకాడమి అవార్డులు అందుకున్న మూడు చిత్రాల ఫిల్మ్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగిన ముగింపు సమావేశంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ టూరిజం అభివృద్ధికి ఫిల్మ్ ఫెస్టివల్స్ దోహదపడతాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన అన్ని హంగులతో వుడా థియేటర్ ఉన్నా సినిమాలు ప్రదర్శన జరగడం లేదన్నారు. అనంతరం ఆస్కార్ అవార్డు పొందిన 'ది వేల్' చిత్రాన్ని ప్రదర్శించారు.

సీఐఐ దక్షిణ ఉమెన్ నెట్‌వర్క్ చైర్‌పర్సన్‌గా లక్ష్మి



బీచ్‌రోడ్డు: పాత్ర ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మి ముక్కవిల్లి సీఐఐ దక్షిణ భారత్ ఉమెన్ నెట్‌వర్క్ చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. 2023–24 సంవత్సరానికి గాను సీఐఐ ఉమెన్ నెట్‌వర్క్ కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. చైర్ పర్సన్‌గా లక్ష్మి ఎన్నిక కాగా, డిప్యూటీ చైర్‌పర్సన్‌గా బెంగళూరుకు చెందిన ట్రాన్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ షిరిన్ సాలిస్ ఎన్నికయ్యారు.

నిజరూపం అపురూపం



- వైభవంగా అప్పన్న చందనోత్సవం
- భక్తజన సంద్రంగా మారిన సింహగిరి
- నిజరూపాన్ని తిలకించిన 2.25 లక్షల మంది భక్తులు
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిజరూప దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూపాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. ఏడాదికి ఒక్క రోజు మాత్రమే లభించే ఈ అరుదైన దర్శనాన్ని చేసుకుని భక్తిపారవశ్యంలో మునిగితేలారు. వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని అప్పన్న చందనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేశారు. అనంతరం వెండి బొరుగుతో స్వామిపై ఉన్న 12 మణుగుల చందనాన్ని ఒలిచి నిజరూపభరితున్ని చేశారు. తదుపరి విశేషపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటల



నడిచి వెళ్తున్న భక్తులు

సమయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబసమేతంగా స్వామివారి తొలిదర్శనం చేసుకున్నారు. అనంతరం 3.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలను ప్రారంభించారు. స్వామి నిజరూపాన్ని కనులారా వీక్షించిన





స్వామి దర్శనానికి పిల్లలను భుజాలపై ఎత్తుకొని క్యూల్లో వేచియున్న భక్తులు

భక్తులు ఆనంద పరవశులయ్యారు.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం

రాత్రి 9 గంటల నుంచి సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి వెయ్యి కలశాలతో శ్రీ వైష్ణవస్వాములు గంగా జలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామి నిజరూపాన్ని అర్చకులు అభిషేకించారు. అలాగే 108 వెండి కలశాలతో ఔషధ ద్రవ్యాలను స్వామివారికి అభిషేకించారు. తదుపరి స్వామికి విశేషంగా పూజలు నిర్వహించి తొలివిడతగా 120 కిలోల చందనాన్ని సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

చందనోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు.





దర్శనానికి వస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి





తొలిదర్శనానికి వస్తున్న అశోక్‌గజపతిరాజు దంపతులు, సహస్ర ఘటాభిషేకంలో పాల్గొన్న త్రిదండి చినజీయర్‌స్వామి

ప్రతీ భక్తుడికీ సంతృప్తికరమైన దర్శనం



దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రతీ ఒక్క భక్తుడు సంతృప్తికరంగా స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మొత్తంగా రోజంతా 2.20 లక్షల మంది భక్తులు నిజరూప దర్శనం చేసుకున్నారని వెల్లడించారు. రెవెన్యూ, పోలీస్, దేవదాయశాఖలు పక్కా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఘాట్‌రోడ్డులో ఒక వాహనం మరమ్మత్తులకు గురికావడంతో ట్రాఫిక్ రాకపోకలకు చిన్నపాటి అంతరాయం కలిగిందన్నారు. రెండు, మూడు స్లాట్‌ల్లో టిక్కెట్లు పొందిన భక్తులు ఒకేసారి దర్శనానికి రావడంతో రద్దీ ఏర్పడినట్టు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

సింహాద్రినాథుడి ఆశీస్సులు ఉండాలి: మంత్రి అమర్‌నాథ్



మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, పేర్ని నాని

రాష్ట్ర ప్రజలకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్టు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. చందన స్వామి నిజరూప దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కంటే ఈ ఏడాది మెరుగైన పరిస్థితులు ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారన్నారు. వారందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించారన్నారు.

ఏర్పాట్లు బాగున్నాయి: మంత్రి సీదిరి అప్పలరాజు



మంత్రి సీదిరి అప్పలరాజు

గతంలో కంటే ఈసారి ఎక్కువగా భక్తులు రావడంతో కొద్దిపాటి ఇబ్బందులు ఉన్నా ఏర్పాట్లు మాత్రం బాగా చేశారన్నారు. ఎలాంటి ఆటంకం లేకుండా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆ స్వామి పాదాల చెంతన కొండదిగువ ఉన్న గురుకుల పాఠశాలలో తాను చదువుకున్నానని, తనకు సింహాద్రి అప్పన్న పేరు పెట్టారన్నారు.

భక్తులకు ఇక్కట్లు!

- దర్శనం కోసం బారులు
- అంతరాలయ దర్శనం వల్లే ఆలస్యమంటున్న భక్తులు
- అంచనాలకు మించి రావడం వల్లేనంటున్న అధికారులు
- ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌తోనూ అవస్థలు



క్యూ లైన్‌లో సొమ్మసిల్లిన భక్తుడికి సేవలందిస్తున్న వైద్యులు

సాక్షి, విశాఖపట్నం: ఏడాదికోసారి వచ్చే చందనోత్సవం నాడు సింహాద్రి అప్పన్న దర్శన భాగ్యం కోసం భక్తులు పరితపిస్తుంటారు. అందుకే అన్ని వయసుల వారూ ఎక్కడెక్కడ నుంచో వ్యయ ప్రయాసలకోర్చి వస్తుంటారు. భక్తుల రద్దీకనుగుణంగా సంబంధిత అధికారులు, పోలీసులు చర్యలు చేపడతారు. కానీ ఈ ఏడాది చందనోత్సవం నిర్వహణలో జిల్లా యంత్రాంగం, పోలీసులు విమర్శలను ఎదుర్కొన్నారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు సకాలంలో దర్శనం కల్పించక లేకపోవడం, నిర్వహణలో సమన్వయం కొరవడడం వెరసి వారి ఆగ్రహానికి గురికావలసి వచ్చింది. అప్పన్న దర్శనానికి రూ.300, 1000, 1500 టికెట్లను ఆన్‌లైన్ ద్వారా జారీ చేశారు. ఈసారి చందనోత్సవానికి సుమారు లక్షన్నర మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. కానీ అంచనాలకు మించి 2.25 లక్షల మంది వచ్చారు. రాజగోపురానికి ఒకవైపు రూ.1500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు, మరోవైపు సిఫార్సు లేఖలతో రూ.1500 టికెట్లు పొందిన వీఐపీ ప్రొటోకాల్ భక్తులకు, బస్టాండు నుంచి రూ.వెయ్యి, 300 టికెట్ల వారికి, లోవతోట నుంచి ఉచిత ప్రవేశ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రూ.1500 టికెట్లు పొందిన వారికి ఈసారి అంతరాలయం దర్శనం కల్పిస్తామని ప్రకటించారు. దీంతో అధిక సంఖ్యలో ఈ టికెట్ల అమ్మకాలు జరిగాయి.

వేకువజాము నుంచే..

ఆదివారం వేకువజాము 3 గంటల నుంచి దర్శనానికి అవకాశం కల్పించడంతో భక్తులు క్యూలైన్లకు చేరుకోవడంతో రద్దీ మొదలైంది. అంతరాలయం దర్శనంతో సమయం ఎక్కువ పట్టడంతో ఈ క్యూలైన్లలో నిల్చున్న వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. వీరిలో ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, ప్రముఖులు ఉన్నారు. మరోవైపు ఈ రెండు క్యూలైన్ల మధ్య నుంచి వీఐపీల పేరిట వారి సంబంధీకులు గుంపులు గుంపులుగా రావడం, వారిని రాజగోపురం ద్వారా పోలీసులు అనుమతిస్తుండడం.. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఆగ్రహం తెప్పించింది. తీవ్ర అసహనానికి గురైన కొంతమంది భక్తులు ఇనుప బారికేడ్లను పెకిలించి రాజగోపురం ద్వారా ప్రవేశానికి దూసుకొచ్చారు. దీంతో పోలీసులకు, భక్తులకు తోపులాటలు జరిగాయి. అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన అధికారులు, పోలీసులు ఆదివారం మధ్యాహ్నం నుంచి అంతరాలయ దర్శనాలను రద్దు చేసి ఆలయ నీలాద్రి గుమ్మం నుంచి లఘు దర్శనం కల్పించారు. అప్పట్నుంచి క్యూలైన్లు కాస్త వేగం పుంజుకున్నాయి. ఇలావుండగా కలెక్టర్ మల్లికార్జున, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణతో కలిసి అంతరాలయంలోనే ఉండిపోవడంతో ఉదయం నుంచి క్యూలైన్లలో గందరగోళ పరిస్థితులను పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే పోలీసులు, దేవదాయశాఖల మధ్య సమన్వయ లోపం కూడా భక్తుల ఇబ్బందులకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో చందనోత్సవాలకు ధ్వజస్తంభం వద్ద నుంచి గేటు ద్వారా ప్రొటోకాల్ భక్తులను అనుమతించే వారని, ఈసారి అందుకు భిన్నంగా వేద ఆశీర్వచనం నుంచి పంపడం కూడా ఇబ్బందులకు కారణమని చెబుతున్నారు. కాగా ఆదివారం అర్ధరాత్రి వరకు దర్శనానికి భక్తులకు అనుమతించారు.



రోప్‌ని దాటుకుని దర్శనానికి వస్తున్న రూ.1500 టికెట్ క్యూలోని భక్తులు

మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ

వీఐపీ, ప్రొటోకాల్ క్యూలైన్లలో భక్తులకు మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని భక్తులు మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తెచ్చారు. దీంతో వారికి మజ్జిగ, మంచినీళ్లను అందించే ఏర్పాట్లు చేశారు.

ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు



ఘాట్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

భక్తులతో పాటు వాహనాల రద్దీ పెరిగింది. దీంతో కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డుపై ఆదివారం ఉదయం నుంచే ట్రాఫిక్ జామ్ అయింది. గంటల తరబడి వాహనాలు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కొండ దిగువ నుంచి పైకి, పై నుంచి దిగువకు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని బస్సులు మాత్రమే వెళ్లగలిగాయి. ఫలితంగా పలువురు భక్తులు కాలినడకనే వెళ్లి వచ్చారు.



సింహగిరిపై ఉచిత బస్సుల వద్ద రద్దీ

రోజంతా ఎంజాయ్ చేసేలా..



కార్వాన్



కార్వాన్ లోపలి భాగం

- అందుబాటులోకి రానున్న కార్వాన్ పర్యాటకం
- తొలివిడతలో అరకు, లంబసింగిలో ప్రారంభించేందుకు సన్నాహాలు
- వాహనం సైజును బట్టి ప్యాకేజీలు

సాక్షి, విశాఖపట్నం : ట్రెండింగ్ టూరిజం వైపు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచ దేశాల్లోనూ, మన దేశంలో వివిధ ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంటున్న కార్వాన్ పర్యాటకం ఉమ్మడి విశాఖజిల్లాలో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఆశాఖ ఉన్నతాధికారులు ఇందుకు సంబంధించి నివేదిక సిద్ధం చేశారు. టూరిజంలో సరికొత్త విప్లవానికి సన్నాహాలు చేస్తున్నారు. తొలివిడతలో అరకు, లంబసింగిలో ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

కార్వాన్లను అందుబాటులోకి తెచ్చేందుకు సాధ్యాసాధ్యాలపై పర్యాటకశాఖ ఎండీ కన్నబాబు, ఆర్‌డీ శ్రీనివాస్‌పాణి ఇటీవల అరకు, లంబసింగి, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల్లో పర్యటించి, నివేదికలు సిద్ధం చేశారు. లంబసింగి, వంజంగి తదితర ప్రాంతాల్లో ప్రకృతిని ఆస్వాదించేందుకు కార్వాన్లలో టెంట్లు కూడా ఉంచాలని భావిస్తున్నారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుకు కానున్న వీటికి వాహనాన్ని బట్టి ప్యాకేజీలు నిర్ణయిస్తారు.

మినీ లగ్జరీ హోమ్‌లా...

ప్రతిపాదనల దశలో ఉన్న కార్వాన్లు లగ్జరీ హోమ్‌లు మాదిరిగా అన్ని సౌకర్యాలు ఉంటాయి. లాంజ్ కమ్ బెడ్‌రూమ్, కిచెన్, రెస్ట్‌రూమ్‌లుంటాయి. క్వీన్ లేదా కింగ్ సైజ్ బెడ్, మైక్రోవేవ్, ఎలక్ట్రికల్ కెటిల్, టోస్టర్, ఇండక్షన్ స్టౌ, ఫ్రిడ్జ్ ఫ్రీజర్‌లో వంటగది, షవర్‌తో కూడిన అత్యాధునిక టాయిలెట్, రూఫ్‌టాప్ తదితర సౌకర్యాలన్నీ ఉంటాయని పర్యాటకశాఖ అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు స్మార్ట్ టీవీలు, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టమ్‌తో పాటు సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తారు. వివిధ సైజుల్లో కార్వాన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ పర్యాటక శాఖ భావిస్తోంది. ఎంపిక చేసుకున్న వాహనాన్ని బట్టి ప్యాకేజీ ఉంటుందని పర్యాటకశాఖ చెబుతోంది.

డివిజన్ పరిధిలో అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న రూప్ నారాయణ్ సుంకర్, డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : వాల్తేరు డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రైల్వే బోర్డు మెంబర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెంబర్ రూప్‌నారాయణ్ సుంకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ముందుగా విశాఖలోని రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్, గతిశక్తి ప్రాజెక్టు నిర్మాణ విభాగ సిబ్బందితో వివిధ పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం కేకే లైన్, విశాఖ–బొడ్డవర సెక్షన్‌లో విండో ట్రయిలింగ్ తనిఖీ నిర్వహించారు. మలుపులు, వంతెనలు, గుహలు, క్రాసింగ్స్, రెండో లైన్ పనులు, రైళ్ల వేగం, భద్రత వంటి అంశాలను ఆయన పరిశీలించారు. ట్రాక్ నిర్వహణ, ట్రాక్ అలైన్‌మెంట్ సామర్థ్యం పెంపుదల కోసం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన రైల్ మిల్లింగ్ మెషీన్‌ను బొడ్డవరలో ఆయన ప్రారంభించారు. దీని పనితీరును పరిశీలించారు.

అలలెత్తిన కలల ప్రపంచం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన దాడి వీరభద్రరావు, కేఎస్ చలం

గోపాలపట్నం : అలలెత్తిన కలల ప్రపంచం అనే పుస్తకాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆదివారం ఆవిష్కరించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి డాక్టర్ మద్దాల అచ్చయ్య చేస్తున్న కృషిని కొనియాడారు. రచయిత ఆంజనేయులు తన పుస్తకం ద్వారా మంచి విషయాలు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కేఎస్ చలం, అక్షయ్‌కుమార్, జర్నలిస్టు రమణ మూర్తి, అప్పలనాయుడు బీవీ అప్పారావు, బుద్ధ శివాజీ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జైల్‌లో సౌకర్యాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆరా


నిత్యావసర సరుకులు పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ జైల్ అధికారులతో కలిసి ఆమె ఖైదీల బేరక్‌లు, వంట గది, ఆస్పత్రి, భోజనం కోసం వినియోగిస్తున్న సరుకులను పరిశీలించారు. ఖైదీలకు ఎలాంటి ఆహారం అందిస్తున్నారు, ఏఏ పరిశ్రమలున్నాయి.. వాటి లో ఏఏ వస్తువులు ఉత్పత్తి చేస్తున్నారన్న విషయాలను జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ న్యాయమూర్తికి వివరించారు. జైల్‌లో సౌకర్యాలు, సంక్షేమం గురించి ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయ మూర్తులు గీత, సోనీ, జైల్ అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప పర్యవేక్షణాధికారి సీఎస్ రామచంద్రరావు పాల్గొన్నారు.

వచ్చే నెలలో టీటీ మీట్

విశాఖ స్పోర్ట్స్: టేబుల్ టెన్నిస్ డేను ఆదివారం బీచ్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు హాజరై టీటీ ఆటగాళ్లను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఒలింపియన్ మణిక్యాలు, శ్రీనివాసరావు, శ్రీధర్ హాజరయ్యారు. జిల్లా టీటీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడుతూ మే 13, 14వ తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు ఆటగాళ్లతో మీట్ నిర్వహిస్తామన్నారు.

చందన మూర్తికి వందనం

సింహాచలం: సింహాచలం శ్రీ వరాహ నృసింహస్వామి నిజరూప దర్శనంతో భక్తులు పులకించిపోయారు. ఆ రూపం చూసే అవకాశం తమకే దక్కిందని సంబరపడ్డారు. అప్పన్న చందనోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. సామాన్య భక్తులతోపాటు ప్రముఖులు స్వామి నిజరూప దర్శనం చేసుకున్నారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి పేర్ని నాని, దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త పూసపాటి ఆనంద్ గజపతిరాజు సతీమణి సుదాగజపతిరాజు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.సోమయాజులు, జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రఘునందనరావు, జస్టిస్ సుజాత, జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ సత్యసుందర్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, నగర మేయర్ హరివెంకట కుమారి, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున, నగర సీపీ త్రివిక్రమ్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు స్వామి దర్శనం చేసుకున్నారు.


భక్తులకు తిరునామం దిద్దుతున్న దృశ్యం


క్యూలో వేచి ఉన్న భక్తులు


ఆలయ ధ్వజస్తంభం ప్రాంగణం వద్ద భక్తులు


దర్శనానికి వస్తున్న మంత్రి బొత్స దంపతులు


భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు


మేయర్ హరివెంకట కుమారి కుటుంబ సభ్యులు


సెల్ఫీ దిగుతున్న భక్తులు


సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం కోసం విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి బి.కృష్ణ మోహన్ దంపతులు, జిల్లా న్యాయమూర్తి సాయి కృష్ణ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ


కుటుంబసమేతంగా వస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ


ఆశీర్వాదం అందుకుంటున్న కలెక్టర్ మల్లికార్జున

కనకమహాలక్ష్మి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి


పూజలు చేస్తున్న జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.జ్యోతిర్మయి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో కె.రమేష్‌నాయుడు స్వాగతం పలికారు. అనంతరం వారిచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు గాయాలు

సింహాచలం: చందనోత్సవం సందర్భంగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జగదీష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కొండదిగువ తొలిపావంచా వద్ద త్రీటౌన్ కానిస్టేబుల్ జి.జగదీష్ ఆర్టీసీ బస్సు దిగుతుండగా స్లిప్ అవడంతో కుడికాలు మీద నుంచి బస్సు వెనుక చక్రం వెళ్లిపోయింది. కాలికి తీవ్రగాయమవడంతో ఆరిలోవలో ఓ ఆస్పత్రికి తరలించారు.

ఆయుష్మాన్ అవెంజర్స్ విజేత

విశాఖ స్పోర్ట్స్ : రోటరీక్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో నిర్వహించిన రోటరీ క్రికెట్ లీగ్‌లో ఆయుష్మాన్ అవెంజర్స్ జట్టు విజేతగా నిలిచింది. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో కై ట్స్ కింగ్స్ జట్టుపై విజయం సాధించింది. ఐఎస్‌ఎం మెడికోస్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల ముగింపు కార్యక్రమంలో రోటరియన్స్ మాట్లాడుతూ ఈ పోటీల ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రత్యేక అంధ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి వినియోగిస్తామన్నారు. రోటరీ జిల్లా గవర్నర్ భాస్కరరావు, ఎం.వెంకటేశ్వరరావు, కల్యాణ్ చక్రవర్తి, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ జీఎస్‌రాజు విజేతలకు ట్రోఫీ అందించారు.

ఆటాడుకుందాం రా..!

- అంతర్జాతీయ ప్రమాణాలతో పలు క్రీడా వేదికలు
- 6 క్రికెట్ పిచ్‌లు, 8 బ్యాడ్మింటన్, 4 వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు ఏర్పాటు
- వాటర్ పార్క్, ఫన్‌జోన్, గోకార్టింగ్, స్నోవరల్డ్, వీఆర్ గేమ్స్
- ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొనేలా ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా పోర్టు స్టేడియం
- మే 1 నుంచి 30కి పైగా యాక్టివిటీస్‌లో భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహణ
- జాతీయ స్థాయిలో కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమాలు


సమ్మర్ క్యాంప్‌నకు సిద్ధమైన పోర్టు స్టేడియం

దొండపర్తి (విశాఖ దక్షిణ): రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే గోకార్టింగ్ రేసింగ్ కార్లు.. సాహసాలు క్రీడల ఔత్సాహితుల కోసం అడ్వెంచర్స్ పార్క్.. అలుపెరగని ఆటలకు వాటర్ పార్క్.. పిల్లల ఎంటర్‌టైన్‌మెంట్‌కు ట్రాంపోలిన్ పార్క్.. విశాఖలో హిమపాతం అనుభూతిని కలిగించేలా స్నో వరల్డ్.. అద్భుత ప్రపంచాన్ని కళ్లముందే సాక్షాత్కారమిచ్చేలా వర్చువల్ గేమింగ్ జోన్.. క్రికెట్ నుంచి ఆర్చరీ వరకు అన్ని రకాల అవుట్‌డోర్, ఇండోర్ క్రీడలకు సంబంధించిన వేదికలు.. మానసిక ఉల్లాసానికి సిమ్మింగ్ పూల్.. వాకర్స్ కోసం జాగింగ్ ట్రాక్.. ఇండోర్, అవుట్‌డోర్ జిమ్స్.. సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా యాంఫీ థియేటర్.. ఇలా ఒకటేమిటి.. ఆటలు, పాటలు, క్రీడలు, విద్య, సాహసం, వినోదం, విహారం.. అన్నింటికీ వన్‌టాప్ డెస్టినేషన్‌గా పోర్ట్ స్టేడియం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటి వరకు క్రీడా మైదానంగానే ఉన్న ఈ స్టేడియాన్ని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు స్పోర్ట్స్, ఫన్, అమ్యూజ్‌మెంట్, అడ్వెంచర్స్ పార్క్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు అనేక రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ కోచ్‌లతో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తూనే.. మరోవైపు ప్రతి ఒక్కరికీ విశేషంగా ఆకట్టుకొనే విధంగా ఒక టూరిస్ట్ స్పాట్‌గా స్టేడియంలో సర్వహంగులు అద్దుతున్నారు.

మే 1 నుంచి భారీ సమ్మర్ క్యాంప్

విశాఖలోనే అతి పెద్ద సమ్మర్ క్యాంప్ నిర్వహణకు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ శ్రీకారం చుట్టింది. మునుపెన్నడూ ఎవరూ చేయని విధంగా దేశంలో ప్రముఖ స్పోర్ట్స్ అకాడమీల సహకారంతో ఒకేసారి 30కిపైగా క్రీడా, విద్య, వినోదానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తోంది. మే 1వ తేదీ నుంచి ఆరు వారాల పాటు ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలతో ప్రత్యేక స్పోర్ట్స్ పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసింది. ఒకేసారి 1500 వరకు ఈ శిబిరంలో క్రికెట్ నుంచి కర్రసాము వరకు.. టెన్నిస్ నుంచి కుకింగ్ వరకు.. డ్యాన్స్ నుంచి డిబేట్స్ వరకు.. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లలో జాతీయ స్థాయి కోచ్‌లతో క్యాంప్‌లో చేరిన వారికి శిక్షణ ఇవ్వనుంది. ఈ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా పిల్లల్లో క్రీడలపై మక్కువ పెంచడంతో పాటు, క్రీడా నైపుణ్యాన్ని మరింత పదును పెట్టుకోడానికి ఈ శిక్షణా శిబిరం దోహదపడనుంది. క్రీడలతో పాటు విద్య, వైజ్ఞానిక అంశాలపై కూడా శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులకు మరింత ప్రయోజనకరంగా ఉండనుంది. ఆసక్తి ఉన్న వారు ఒక్కొక్కరు ఒక్కో పూల్‌లో రెండు అంశాలను ఎంచుకొనే అవకాశముంది. వారానికి రూ.500 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అభ్యర్థులకు అనువైన బ్యాచ్‌లలో చేరే అవకాశముంది.

క్రీడామైదానంతో పాటు అమ్యూజ్‌మెంట్ సెంటర్‌గా..

పోర్టు స్టేడియాన్ని క్రీడా మైదానంగానే కాకుండా విశాఖలోనే సరికొత్త అమ్యూజ్ మెంట్ హబ్‌గా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఒకవైపు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచే సే విధంగా ఇక్కడ అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికలను సిద్ధం చేస్తోంది. క్రికెట్‌తో పాటు 8 బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, 4 వాలీబాల్ కోర్ట్సులను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతోంది. అలాగే క్రీడాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కోచ్‌లను తీసుకువచ్చి ఇక్కడ వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. నగర నడిబొడ్డున ఉన్న ఈ పోర్టు స్టేడియాన్ని ఒక క్రీడా వేదికగానే కాకుండా అన్ని వయసుల వారికి అనువైన, ఆరోగ్యం, విహారం, వినోదం పంచే అమ్యూజ్‌మెంట్ హబ్‌గా రూపొందిస్తోంది.

పూల్ ఏ : అవుట్‌డోర్
క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, ఆర్చరీ.

పూల్ బీ: ఇండోర్
టేబుల్ టెన్నిస్, చెస్, కరాటే, రైఫిల్ షూటింగ్, టైక్వాండో(బాయ్స్ అండ్ గర్ల్స్), కర్రసాము, ఫెన్సింగ్

పూల్ సీ: ఆర్ట్స్ అండ్ కల్చర్
డ్యాన్స్, మ్యూజిక్, సింగింగ్, యాక్టింగ్, యోగా, పెయింటింగ్, కుకింగ్.

పూల్ డీ: ఎడ్యుకేషన్ అండ్ ఫన్
సైన్స్ పరిశోధనలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహం, భారత చరిత్ర, రోబోటిక్స్, ట్రెజర్ హంట్, గార్డెనింగ్, డిబేట్ అండ్ గ్రూప్ డిస్కషన్స్.


ఆర్చరీలో శిక్షణ


వాలీబాల్‌లో శిక్షణ

VISHWANADH SPORTS CLUB

ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో..

ఆరు నెలల్లో పోర్టు స్టేడియాన్ని పూర్తి స్థాయి స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ సెంటర్ మారనుంది. పిల్లల కోసం ఫన్ జోన్, ట్రాంపోలిన్ పార్క్, మౌంటేన్ క్లైంబింగ్, సిమ్మింగ్ పూల్, స్నో వరల్డ్, బాక్స్ క్రికెట్ వంటి సౌకర్యాలు త్వరలోనే అందరినీ అలరించనున్నాయి. అలాగే వాకర్స్ కోసం కూడా జాగింగ్ ట్రాక్‌తో పాటు అవుట్‌డోర్, ఇండోర్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ కళాకారుల ప్రదర్శనలకు అనువుగా యాంఫీ థియేటర్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతమున్న కళావాణి ఆడిటోరాయాన్ని మరింత ఆధునీకరించనున్నారు.

బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్



పోర్టు స్టేయాన్ని బెస్ట్ డెస్టినేషన్ ఫర్ స్పోర్ట్స్ అండ్ అమ్యూజ్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశాం. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా వేదికలే కాకుండా.. అన్ని వయసుల వారిని అలరించి, వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచే పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌గా త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటికే జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో మే 1వ తేదీ నుంచి భారీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలా మంది పోర్టు స్టేడియానికి వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో ఆరు నెలల్లో స్పోర్ట్స్, ఫన్ యాక్టివిటీస్ అందరినీ అలరిస్తాయి.

– ప్రమోద్, మేనేజింగ్ డైరెక్టర్, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్

పోర్టు స్టేడియం, మండపాలు ప్రైవేటుపరం తగదు


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

సీతంపేట: పోర్టు స్టేడియం, కల్యాణ మండపాలు ప్రైవేటుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ పోర్టు స్టేడియం ఎదుట పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నిరసన వ్యక్తం చేశాయి. సంఘ నాయకులు జగన్, మసేన్ మాట్లాడుతూ పోర్టు స్టేడియం, కల్యాణ మండపాలు ఎవరి దయా దాక్షిణ్యాల వల్ల రాలేదని, పోర్టు కార్మికుల కష్టపడడం వల్ల కార్మికుల సంక్షేమం , అభివృద్ధికి స్టేడియం, మండపాలు వచ్చాయన్నారు. ఇవన్నీ ప్రజల డబ్బులతో నిర్మించినవని, జీవీఎంసీ స్పోర్ట్స్ అకాడమీ షేర్స్ కూడా ఉన్నాయని తెలిపారు. ప్రజల పన్నులు ద్వారా ఏర్పాటైన స్టేడియం , కల్యాణ మండపాలు ప్రైవేటుపరం చెయ్యడం అన్యాయమన్నారు. పోర్టు ఇండోర్ స్టేడియాన్ని గంటా శ్రీనివాసరావు అనుచరులకు ఇచ్చారని, స్థానిక ఎమ్మెల్యేగా ఉంటూ గంటా శ్రీనివాసరావు ప్రజల పక్షమా, కాంట్రాక్టర్ పక్షమా తేల్చుకోవాలన్నారు. ప్రైవేటుపరం చెయ్యడానిన నిరసిస్తూ ఈ నెల 25న మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు నల్ల రిబ్బన్లతో ఏవోబీ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు అంజి, సీఐటీయూ నాయకులు లక్ష్మణరావు, సీఎఫ్‌టీయూ నాయకులు కనకరావు, వాకర్స్ నాయకులు సత్యనారాయణ, త్రినాథరావు, నరసింగరావు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సౌజన్య త్రివిక్రమ్ అభినయం


మీనాక్షి కల్యాణం నృత్యరూపకంలో సౌజన్య త్రివిక్రమ్

బీచ్‌రోడ్డు: మీనాక్షి కల్యాణం నాట్య ప్రదర్శన ప్రేక్షకులను కట్టిపడేసింది. ప్రాచీన యక్షగాన సంప్రదాయ శైలి అధునాతన సాంకేతిక నైపుణ్యాల మేలు కలయిక రసహృదయాలను సంతృప్తి చేసింది. వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం ప్రదర్శించిన మీనాక్షీ కల్యాణం కూచిపూడి సంప్రదాయ నృత్యరూపకం నవరసావిష్కారం చేసింది. ప్రఖ్యాత సినీదర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సౌజన్య ఇందులో మధుర మీనాక్షిగా పరకాయ ప్రవేశం చేసి హృదయాలను కొల్లగొట్టారు. కూచిపూడి సంప్రదాయ నృత్యరీతిలోనేకాక మరే ఇతర భారతీయ సంప్రదాయ నృత్యరీతిలోనూ సంపూర్ణ ప్రదర్శన కథనంగా మునుపెన్నడూ వెలుగు చూడని మధుర మీనాక్షి అమ్మవారి ఇతివృత్తాన్ని అద్భుతంగా నృత్యపరికల్పన చేసిన పసుమర్తి రామలింగశాస్త్రి విమర్శకుల మన్ననలందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రఖ్యాత కార్టూనిస్టు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయిత భమిడిపల్లి నరసింహ మూర్తి కలం నుంచి జాలువారిన మీనాక్షి కల్యాణం కూచిపూడి నృత్యరూపక ప్రదర్శన ఆబాలగోపాలాన్నీ రసడోలికల్లో తేలియాడించింది. ఈ ప్రదర్శన బాలాజీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, డాక్టర్ ఎలైట్ డయాగ్నోసిస్ సంస్థల సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి విశాఖ సాహితీ అధ్యక్షురాలు కోలవెన్ను మలయవాసిని, గౌరవ అతిథులు ఎమ్మార్సీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, బాలాజీ విద్యా సంస్థల చైర్మన్, శ్రీ బాలాజీ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మండవ రవి కుమార్ పాల్గొన్నారు.

అవిలా విశ్వవిద్యాలయంతో 'శశి' అవగాహన ఒప్పందం


అవిలా ప్రతినిధులతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ

తగరపువలస : యునైటెడ్ స్టేట్స్‌లోని మిస్సోరియాకు చెందిన అవిలా విశ్వవిద్యాలయంతో విశాఖకు చెందిన శశి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఆదివారం సంగివలస శశి విద్యాసంస్థలలో జరిగిన కార్యక్రమంలో పరస్పరం ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల ప్రతినిధులు మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులకు రీసెర్చ్, జ్ఞానాభివృద్ధికి ఈ అవగాహన తోడ్పడుతుందన్నారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అవిలా విశ్వవిద్యాలయం సహాయ సహకారాలు అందిస్తుందని ఆ విశ్వవిద్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శశి విద్యాసంస్థల వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, కార్యదర్శి, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇస్మాయిల్ , అవిలా విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొన్నారు.